


లైన్‌ట్రిప్, ఎల్‌సీలంటూ గంట కోత




ఆరెకరాల్లో వేరుశనగ, టమోటా పంటలు సాగుచేశా. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టా. వ్యవసాయానికి పగటి పూట ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇచ్చే నాలుగు గంటల సరఫరాలో లైన్‌ట్రిప్, ఎల్‌సీలు, ఉత్పత్తి కేంద్రాల వద్దనే కోతలు అంటూ గంట కోత విధిస్తున్నారు. సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ఇచ్చే 3 గంటల సరఫరాలో కూడా సాంకేతిక లోపాలు, ఫీజులు పోయాయని గంట ఇలా మొత్తానికి 6 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయట్లేదు. దీంతో పంటలు ఎండుతున్నాయి.

- గంగాద్రి, రైతు, వంగంపల్లి, కొత్తచెరువు మండలం



కరెంటు కరువు



ఖరీఫ్‌లో వర్షాభావంతో
రైతన్నకు నష్టం

ఖరీఫ్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. చినుకు జాడ లేక పంటలు నిట్టనిలువునా ఎండిపోయాయి. చేసేదిలేక రైతులు పంటలను అర్ధంతరంగా తొలగించేసుకున్నారు. సర్వం నష్టపోయి, అప్పులపాలయ్యారు. కరువు కోరల్లో చిక్కుకున్నారు. రబీలోనైనా బోరుబావుల కింద అంతో ఇంతో విస్తీర్ణంలో పంటలు పెట్టుకుని, ఖరీఫ్ నష్టాల నుంచి కాస్త ఉపశమనం పొందుదామనుకున్నారు. ఆ మేరకు రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి, పంటలు సాగుచేశారు. ఈసారి అన్నదాతను కొత్త కరువు చుట్టుముట్టింది. అదే కరెంటు కరువు. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా మాటలకే పరిమితమైంది. రోజులో ఏడు గంటలు కూడా సక్రమంగా సరఫరా చేయట్లేదని రైతులు వాపోతున్నారు. పగలు కాసేపు.. రాత్రి కాసేపు సరఫరా చేస్తుండడంతో అన్నదాతలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇందులోనూ ఎడాపెడా కోతలు విధిస్తున్నారు. సాంకేతిక సమస్యల సాకుతో పదేపదే విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. దీంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. వరిమళ్లలో నెర్రెలు ఏర్పడుతున్నాయి. దీంతో పంట దిగుబడిపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈసారి కూడా నష్టపోతే తమ పరిస్థితి మరింత దిగజారుతుందని ఆవేదన చెందుతున్నారు.

- కొత్తచెరువు

రబీలో తీవ్రమైన విద్యుత్ కోతలు

లో ఓల్టేజీతో ఎండుతున్న పంటలు

నెర్రెలు చీలిన వరిమళ్లు

దిగుబడిపై అన్నదాతల్లో ఆందోళన

అన్నదాతల మండిపాటు

ఒకవైపు ముదురుతున్న ఎండలు.. మరోవైపు విద్యుత్ సరఫరా 7 గంటలు దీంతో పంటలు ఎక్కడికక్కడ ఎండుతున్నాయి. వ్యవసాయానికి ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. రాత్రింబవళ్లు శ్రమించి పంటలు సాగుచేస్తే అంతో.. ఇంతో.. ఆదాయం వస్తుందని ఆశిస్తే వైసీపీ ప్రభుత్వం తమ జీవితాలతో ఆడుకుంటోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి 9 గంటలపాటు కోతలులేని విద్యుత్ సరఫరా చేస్తామనీ, తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పిన సీఎం జగన్.. 7 గంటలకు తగ్గించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. గతంలో 9 గంటల ఉచిత విద్యుత్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందని విమర్శలు గుప్పిస్తున్నారు. అన్నంపెట్టే రైతులకు అన్యాయం చేస్తున్నారన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు.



వరిమడిలో నెర్రెలను చూపుతున్న రైతులు

కదిరి సీఐపై నివేదిక ఇవ్వండి

కలెక్టర్, ఎస్పీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశం

కందికుంట ఫిర్యాదుకు స్పందన

కదిరి, ఫిబ్రవరి 23: పట్టణ సీఐగా ఇటీవల విధుల్లో చేరిన పుల్లయ్య.. వైసీపీ నాయకులతో కలిసి తిరగడాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఫిర్యాదుపై స్పందించింది. రెండ్రోజుల్లోగా సీఐ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా.. జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని కందికుంట శుక్రవారం వెల్లడించారు. ఆ మేరకు ఫిర్యాదుదారు అయిన కందికుంటకు కూడా ఎన్నికల కమిషన్ ఓ కాపీ పంపింది.



ధర్మవరం మండలం పోతుకుంట గ్రామం వద్ద నీరు అందక నెర్రెలు చీలిన వరిమడి



ఒకే ట్రాన్స్‌ఫార్మర్

గ్రామం మొత్తానికి ఒకే ట్రాన్స్‌ఫార్మర్. దీంతో తరచూ ఫ్యూజులు ఎగిరిపోవడం, లోఓల్టేజీ తలెత్తడంతో మోటార్లు కాలిపోతున్నాయి. వెరసి పంటలకు సరిగా నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం మండలంలోని పోతుకుంట గ్రామానికి ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గ్రామస్థుల గృహ అవసరాలు, వ్యవసాయానికి అదొక్కటే దిక్కు. ప్రస్తుతం రబీలో గ్రామ రైతులు వంద ఎకరాలకుపైగా వరిమళ్లు సాగు చేశారు. లోఓల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ నిత్యం మరమ్మత్తులకు లోనవుతోంది. దీంతో పంటలకు నీరు పారక నెర్రెలు చీలుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మోటార్లు సైతం కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కరెంటు కోసం రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోందనీ, ఇలాగైతే పంటలు ఎలా బతుకుతాయని ఆవేదన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించి, విద్యుత్ సరఫరా సమయాన్ని పెంచకపోతే పంటలు కోల్పోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

- ధర్మవరం రూరల్



విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయి

నాలుగెకరాల్లో వరి, మొక్కజొన్న సాగుచేశా. పది రోజులుగా ఎండలు మండుతున్నాయి. 7 గంటల కరెంటుతో పొలంలో నీరు పారడం లేదు. దీంతో పంటలు ఎండుతున్నాయి. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితులు కనిపించట్లేదు.

- పీవీ సాయికుమార్, రైతు, కొత్తచెరువు

మోటార్లు కాలిపోతున్నాయి



14 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశా. రూ.5లక్షలదాకా పెట్టుబడి పెట్టా. లోఓల్టేజీతో ఇప్పటివరకు నాలుగుసార్లు మోటార్లు కాలిపోయాయి. ప్రతిసారీ మోటారు మరమ్మతులకు రూ.6వేలు ఖర్చవుతోంది. ఇదంతా అదనపు భారం. లోఓల్టేజీ, మోటారు మరమ్మతులతో సక్రమంగా నీరు అందక పంట ఎండిపోతోంది.

- రాఘవేంద్ర, పాడరాళ్లపల్లి, ముదిగుబ్బ మండలం

సరిహద్దుల్లో

నిఘా పెంచండి

- కర్ణాటక మద్యం వస్తే ఉపేక్షించేది లేదు
- సెబ్ అధికారులకు డీసీ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

హిందూపురం, ఫిబ్రవరి 23: ఎన్నికలు సమీపిస్తున్న వేళ సరిహద్దుల్లో సెబ్ అధికారులు నిఘా పెంచాలని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) నాగమద్దయ్య ఆదేశించారు. జిల్లాలోని సరిహద్దు చెక్‌పోస్టులను డీసీ శుక్రవారం తనిఖీ చేశారు. హిందూపురం మండలం తూమకుంట, చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టుల్లో భద్రతను పరిశీలించారు. అనంతరం హిందూపురం సెబ్ స్టేషన్‌కు చేరుకుని, అధికారులతో సమీక్షించారు. డీసీ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ పక్కరాష్ట్రం నుంచి అక్రమ మద్యం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక మద్యం వచ్చినట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఎవరికైనా సహకరించినట్లు తెలిసినా ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ రాజశేఖర్ గౌడ్, శ్రీరాములు, ఎస్ఐ చాంద్‌బాషా పాల్గొన్నారు.

- ఇంటి పట్టాలు తెచ్చిన తంటా

పట్టాల ఫైట్..

అధికార పార్టీ నేతల బాహాబాహీ

ఓ వర్గం వారిని చితకబాదిన వైనం

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 23: వైసీపీ పాలనలో అడ్డగోలుతనానికి ఇది నిదర్శనం. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. ప్రభుత్వ భూములను పంచేసుకుంటున్నారు. ఎకరాల కొద్దీ ఆక్రమిస్తున్నారు. తమ వారికి అర్హత లేకున్నా.. ఇంటి పట్టాలు కట్టబెడుతున్నారు. ఈ అడ్డగోలుతనమే పెనుకొండలో ఘర్షణకు దారితీసింది. అదీ.. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపున జగనన్న లేఔట్ వేశారు. అందులో శ్మశానానికి స్థలం కేటాయించారు. అందులో కౌన్సిలర్ తయూబ్ ఒత్తిడితో ఐదుగురికి రెండు సెంట్ల చొప్పున ఆన్‌లైన్ పొజిషన్ పట్టాలు మంజూరు చేశారు. పట్టాలు పొందినవారు రెండు నెలల క్రితం ఆ స్థలాల్లో నిర్మాణాలకు ఉపక్రమించారు. స్థానికులు అడ్డుకున్నారు. శ్మశాన స్థలంలో పట్టాలు ఎలా ఇచ్చారని నిలదీశారు. అప్పటికప్పుడు ఆన్‌లైన్ పట్టాలను రద్దు చేశారు. పట్టాలు పొందినవారు రెండు రోజుల క్రితం మళ్లీ నిర్మాణ పనులు చేపట్టగా.. రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీనిని జీర్ణించుకోలేని కౌన్సిలర్ తయూబ్ అనుచరులతో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న వీఆర్వో తేజపై దూషణల పర్వం అందుకున్నారు. పెనుకొండ నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్ ప్రోద్బలంతోనే పట్టాలను రద్దు చేసి ఉంటారని అధికారులపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న వైస్ చైర్మన్ సునీల్ కుటుంబ సభ్యులు, అనుచరులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారంటూ కౌన్సిలర్ తయూబ్ అనుచరులను కార్యాలయంలోనే చితకబాదారు. దీంతో కాసేపు కార్యాలయంలో యుద్ధ వాతావరణం కనిపించింది. అక్కడే ఉన్న కొంతమంది సర్ది చెప్పి, వారిని అక్కడి నుంచి పంపించేశారు.





పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం

పట్టాల పంపిణీపై విచారిస్తాం

కార్యాలయంలో అధికారులను దూషించడం సరికాదు. పట్టాల పంపిణీపై క్షేత్రస్థాయిలో విచారిస్తాం. వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- ఉదయశంకర్ రాజు, తహసీల్దార్, పెనుకొండ

క్లెయిమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ అరుణ్‌బాబు



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 23: ఓటర్ల జాబితా అభ్యంతరాలపై వచ్చిన క్లెయిమ్‌ల పరిశీలన, పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ, క్లెయిమ్‌లపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. ఫారం-6, 7, 8 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన అభ్యంతరాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ పాల్గొన్నారు.



గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి, ఫిబ్రవరి 23: జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో కొండయ్య.. సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. 25వ తేదీన 28 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 8239 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1గంట వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. 11 రోజుల్లో 28 పరీక్షా కేంద్రాల్లో లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ఉంటారన్నారు. ఇందుకోసం 395మంది ఇన్విజిలేటర్లు, 362 గదులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ అశోక్, వెంకటరమణ, ఏఓ రామాంజనేయ రెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

పురం ఆస్పత్రికి క్రిటికల్ కేర్ యూనిట్

రూ.23 కోట్లతో పనులు

రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ



హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 23: దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రం పైన 50 పడకలతో అత్యవసర విభాగం (క్రిటికల్ కేర్ యూనిట్) ఏర్పాటు చేయనున్నారు. రూ.23 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈనెల 25వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా యూనిట్‌ను ప్రారంభిస్తారని డీసీహెచ్ తిప్పేంద్రనాయక్ శుక్రవారం తెలిపారు. ఆయన శుక్రవారం ఆస్పత్రిలో యూనిట్ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించారు. క్రిటికల్ కేర్ యూనిట్లను రాష్ట్రంలో తెనాలి, హిందూపురంలో ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. యూనిట్ ఏర్పాటైతే అత్యవసర కేసులకు ఇక్కడే వైద్యం అందుతుందన్నారు. వంద పడకలకు అనుమతి ఉన్నా.. ఆస్పత్రిలో స్థలం లేదని 50 యూనిట్లకే పరిమితం చేసినట్లు తెలుస్తోంది. ఆస్పత్రి వెనుకవైపున విశాలమైన స్థలం ఉన్నా.. స్థలం లేదని పేర్కొనడాన్ని వైద్యవర్గాలే తప్పుబడుతున్నాయి. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆధునిక వ్యవసాయం వైపు మళ్లించాలి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 23: రైతులను ఆధునిక వ్యవసాయం మళ్లించాలని గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏరువాక జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ.. ఏరువాక కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించాలన్నారు. వేరుశనగ నూతన వంగడాలపై రైతులకు తెలియజేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ విధానంలో తలెత్తే సమస్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. వేరశనగలో తెగుళ్ల నివారణ, అంతర పంటల మీద ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ రవికిశోర్, జిల్లా వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతు శుభకరణ్ సింగ్‌ది కేంద్ర ప్రభుత్వ హత్యే

ధర్మవరం, ఫిబ్రవరి 23: రైతు శుభకరణ్ సింగ్‌ది కేంద్రప్రభుత్వ హత్యేనని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమంపై బీజేపీ ప్రభుత్వ దమనకాండ నశించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. రైతులకిచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీకి వెళ్లిన రైతులపై కేంద్రం కాల్పులు జరిపి, పోలీసులతో పైశాచిక దాడి చేయించిందన్నారు. కాల్పుల్లో యువ రైతు శుభకరణ్ సింగ్ ప్రాణాలు కోల్పోయారన్నారు. రైతు ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, సీఐటీయూ నేత ఎస్‌హెచ్ బాషా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఏఐటీయూసీ చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

తుక్కు దొంగలుపై కమిషనర్ నిలదీత



కమిషనర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు

కదిరి, ఫిబ్రవరి 23: మున్సిపాలిటీలో తుక్కు మాటున ఎలక్ట్రికల్ సామగ్రిని మాయం చేయడంపై 'తుక్కు దొంగలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనం పట్టణంలో చర్చనీయాంశమైంది. తుక్కు మాయంపై కౌన్సిలర్లు కృపాకర్ రెడ్డి, రంగారెడ్డి, మహమ్మద్, వైసీపీ నాయకులు నూరుల్లా, జిలాన్ తదితరులు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. మున్సిపాలిటీలోని తుక్కు బయటకు ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. అధికారుల అనుమతి లేకుండా ఎలా సాధ్యమని మండిపడ్డారు. మున్సిపాలిటీలో దాదాపు రూ.25లక్షల విలువ చేసే తుక్కు సామగ్రి ఉన్నట్లు గతంలో అధికారులు ప్రకటించారని గుర్తుచేశారు. ఆ తుక్కు ఏమైందో సమగ్ర విచారణ చేయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ.. తుక్కు తరలింపుపై విచారణ చేస్తున్నామన్నారు. తప్పకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

రేపు గ్రూప్-2 పరీక్ష

• అధికారులతో కలెక్టర్ గౌతమి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 23: గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. మొత్తం 32,391 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికోసం జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించామని, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేసి, పటిష్ట బందోబస్తు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు ఇబ్బంది పడకుండా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష ముగిసే వరకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడాలని అన్నారు. మున్సిపాలిటీలలో కమిషనర్లు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లు బాధ్యత తీసుకుని, పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు ఉదయం 9-30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టరు సూచించారు. వారికి బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ అపరంజని, సెక్షన్ ఆఫీసర్లు నవజ్యోతి, యశోద, డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, అడిషినల్ ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లా మత్స్యసహకార సంఘం ఎన్నికలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి23: జిల్లా మత్స్యసహకార సంఘానికి సంబంధించిన ఎన్నికలు 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పక్కీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు చేతులు ఎత్తు పద్ధతి ద్వారా నిర్వహిస్తామన్నారు. 27న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11 నుంచి 12 గంటల వరకూ నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు నామినేషన ఉపసంహరణ, 2 గంటల నుంచి చేతులు ఎత్తు పద్ధతి ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్యసహకార సంఘం సభ్యులు, అధ్యక్షులందరూ ఎన్నికల అధికారి జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును ఎన్నికలకు తీసుకురావాలన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు


ప్రిన్సిపాల్ సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 23: డా. బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ దరఖాస్తు గడువు 28వ తేదీ వరకు పొడిగించినట్లు కురుగుంట పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కురుగుంట పాఠశాలలో ఆమె విలేకర్లకు పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 90 టన్నులు వచ్చాయన్నారు.

నేడు ఊరంతా ఖాళీ

403 సంవత్సరాలుగా వస్తున్న ఆచారం


తలారి చెరువు

మాఘపౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని తలారిచెరువు గ్రామం శనివారం ఖాళీ కానుంది. బ్రహ్మహత్య పాప విముక్తి కోసం 403 సంవత్సరాలుగా గ్రామస్థులు ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామమంతా ఖాళీ చేసిన ప్రజలు సమీపంలోని హాజివలి దర్గాలో ఉంటారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి ఎలాంటి దీపాలు గానీ, పొయ్యిలు గానీ ముట్టించకుండా అర్ధరాత్రి వరకు ఉంటారు. అనంతరం ఇళ్లను శుభ్రం చేసుకొని యథావిధిగా దైనందిన కార్యక్రమాల్లో కొనసాగుతారు. - తాడిపత్రి

నేడు కలెక్టరేట్ ఎదుట బెస్తల దీక్ష
శ్రీకృష్ణపై దాడికి నిరసన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 23: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వ్యతిరేకిస్తూ అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన దీక్ష చేపడతామని బెస్తసేవా సంఘం నాయకులు చేపల హరి, కేవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసన దీక్షకు ఉమ్మడి జిల్లాలోని బెస్తలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దేవదేవుడి వేడుక

- నేడు కొండమీదరాయుడి రథోత్సవం
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీ


కొండమీద రాయుడు


వేడుకకు సిద్ధమైన రథం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం జరగనుంది. స్వామి వైభవాన్ని కన్నులారా చూసేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో ఏడో రోజు, మాఘ శుద్ధ పౌర్ణమినాడు స్వామివారు రథంపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 11:45 గంటల నుంచి 12:30 గంటల వరకు మడుగు తేరును లాగుతారు. అంతకు ముందు వేద పండితులు సర్వజనుల క్షేమాన్ని, శాంతిని ఆకాంక్షిస్తూ రథం వద్ద హోమం నిర్వహిస్తారు. వేకువ జామున లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారికి కల్యాణోత్సవం జరిపిస్తారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారిని అధిష్టింపజేసి, పల్లకిలో ఊరేగిస్తూ రథం వద్దకు తోడ్కొని వస్తారు. రథం చుట్టూ ప్రదక్షిణ చేయించి, రథంపై అధిష్టింపజేస్తారు. గుమ్మడికాయతో స్వామి, అమ్మవార్లకు దిష్టితీసిన అనంతరం భక్తులు ఆంజనేయ స్వామి ఆలయం వరకూ మడుగు తేరు లాగుతారు. స్వామివారి రథోత్సవం సాయంత్రం 4 గంటలకు మొదలౌతుంది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి బ్రాహ్మణ వీధి వరకు రథాన్ని లాగి.. యథాస్థానానికి చేరుస్తారు. ఇంతటితో రథోత్సవం ముగుస్తుంది. ఈ వేడుకలకు రాయలసీమ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. బుక్కరాయసముద్రంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి

కొండమీదరాయుడి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి పుట్టుశిల అయిన దేవరకొండపైకి వెళ్లడానికి ఆలయ కమిటీ అధ్వర్యంలో పరిమితంగా వాహనాలను ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు దేవరకొండపై తాగునీరు, అన్నప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు, శింగనమల సీఐ శ్రీధర్, పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్తును పర్యవేక్షిస్తారు. అనుమానితులు కనిపిస్తే సెల్ నంబర్ 9440796816, లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అంతేనా..!

పది పాస్ చేయించే ఆలోచనే లేదా..?

- హాస్టల్ విద్యార్థుల భవిత పట్టని అధికారులు
- రెండేళ్లుగా 40 శాతం దాటని ఉత్తీర్ణత
- వైఫల్యాలను అలవాటుగా మార్చుకున్నారు..!
- ఇప్పుడు మేలుకున్నా.. పరిస్థితి మెరుగౌతుంది




బీసీ సంక్షేమశాఖ కార్యాలయం, స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 23: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ పదే పదే అప్రమత్తం చేస్తుంటారు. వార్డెన్లు స్థానికంగా ఉండాలని, స్టడీ అవర్స్‌ను పక్కాగా నిర్వహించాలని కూడా ఆదేశిస్తుంటారు. సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు వార్డెన్లను అప్రమత్తం చేస్తున్నారు. కానీ ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా..? లేదా..? ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. అందుకే రెండేళ్లుగా హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణత దారుణంగా పడిపోతోంది. కొన్ని హాస్టళ్లలో ఒక్కరంటే ఒక్కరూ పాస్ కాలేదు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా.. విద్యా సంవత్సరంలో ఎలాంటి కార్యాచరణా అముల చేయడం లేదు. సంక్షేమశాఖల ఉన్నతాధికారుల నుంచి వార్డెన్ల వరకూ అలసత్వం కనిపిస్తోంది. ఉత్తీర్ణత 40శాతం కూడా దాడటం లేదు. గత వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదు. దీంతో పేదింటి విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోంది.

ఉత్తీర్ణత దారుణం

హాస్టల్ విద్యార్థులు పాసైతే.. అదో అద్భుతం అన్నట్లుగా క్షేత్రస్థాయి పరిస్థితులు ఉన్నాయి. 2022 నుంచి ఉత్తీర్ణత శాతం దారుణంగా ఉంటోంది. 2022లో జిల్లా వ్యాప్తంగా 36 బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 589 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 240 మంది ఉత్తీర్ణత సాధించారు. 349 మంది ఫెయిల్ అయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని 35 వసతి గృహాల్లో 436 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 106 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏకంగా 330 మంది ఫెయిల్ అయ్యారు. ఎస్టీ సంక్షేమశాఖ పరిధిలో రెండు జిల్లాలోని వసతిగృహాల్లో 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... కేవలం 11 మంది ఉత్తీర్ణత సాధించారు. 75 మంది ఫెయిల్ అయ్యారు. ఆ ఏడాది మొత్తం ఉత్తీర్ణత 35 శాతం మాత్రమే. 2023లో గుడ్డిలో మెల్ల అన్నట్లుగా 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండేలా కనిపించడం లేదు. వంద శాతం దేవుడెరుగు.. కనీసం 60 శాతం ఉత్తీర్ణత సాధిస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తూతూ మంత్రం

పది పరీక్షలు సమీపిస్తున్న సమయంలో మాత్రమే సంక్షేమ వసతి గృహాల ఉన్నతాధికారులు అప్రమత్తమౌతారు. అప్పుడు మాత్రమే హడావుడి చేస్తారు. అధికారులు ప్రతి రోజూ ఏదో ఒక హాస్టల్‌ను విజిట్ చేయాలి. విద్యార్థులు ఏ మేరకు చదువుతున్నారో పరిశీలించాలి. వార్డెన్లు అందుబాటులో ఉంటున్నారా...? స్టడీ అవర్స్‌కు టీచర్స్ వస్తున్నారా...? తదితర అంశాలను పరిశీలించాలి. వార్డెన్లతో సమావేశం ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షించాలి. ఉత్తీర్ణతను మెరుగుపరిచేందుకు కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలి. సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఇది విద్యాసంవత్సరం మొదటి నుంచి జరగాలి. పరీక్షలకు ముందు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. కనీసం నెల రోజుల పాటు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ ఏ సంక్షేమశాఖ వసతి గృహాల్లోనూ ఆ పరిస్థితి కనిపించడం లేదు. విద్యార్థులను గాలికి వదిలేస్తున్నారు. స్టడీ అవర్స్‌ను చాలా హాస్టళ్లలో పక్కన పెట్టేశారు. మరికొన్ని హాస్టల్స్‌లో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం..



జిల్లావ్యాప్తంగా బీసీ వసతిగృహాల్లో 10వ తరగతి విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విద్యార్థులకు పుస్తకాలు, అనంత సంకల్పం పుస్తకాలు అందజేశాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, బాగా చదివేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ విద్యార్థుల ఫొటోలు తీసి పంపాలని వార్డెన్లను ఆదేశించాం.

\- కుష్బూకొఠారీ, బీసీ సంక్షేమశాఖ డీడీ

నాలుగు నెలలు ముందు నుంచే..



ఏటా ఫిబ్రవరి నుంచి పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తుంటాం. గత ఏడాది నవంబరు నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ప్రతి ఆదివారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. మ్యాథ్స్ సైన్స్ క్వశ్చన్ పేపర్లను నేను ప్రిపేర్ చేసి విద్యార్థులకు అందిస్తున్నా. ఆ క్వశ్చన్ పేపర్లతోనే ప్రతి ఆదివారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆ పరీక్షను సరిగా రాయని వారికి మళ్లీ అదే సబ్జెక్టును బోధించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

\- మధుసూదన్‌రావ్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ


సంఘటన స్థలం వద్ద క్షతగాత్రులు

టైర్ పగిలి వాహనం బోల్తా

- 14మంది కూలీలకు గాయాలు
- అందరూ పశ్చిమబెంగాల్‌కు చెందిన వారే
- యాడికి మండలం వేములపాడు వద్ద ఘటన


గాయపడ్డ కూలీలు

యాడికి, ఫిబ్రవరి 23: మండలంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం కూలీలను తీసుకువెళుతున్న జీపు టైర్ పగిలి బోల్తా పడటంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన 14మంది కూలీలు గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు... పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన తాము కూలి పనుల కోసం వచ్చి తాడిపత్రిలో నివాసం ఉంటున్నామన్నారు. ఈక్రమంలో రాయలచెరువులో అరటి గెలలు కోయడానికి తాడిపత్రి నుంచి జీపులో 17మంది బయల్దేరామన్నారు. వేములపాడు వద్దకు రాగానే తాము ప్రయాణిస్తున్న జీపు టైరు పగిలి వాహనం బోల్తాపడిందన్నారు. కూలీలు అలీ ఇస్లాం, సునిరుత ఇస్లాం, రమణ, సయానా, రంజనా, సాకేత్, ఇస్మాయిల్, ఉమర్‌అలీ, సైమాసనా, అలీమర సలీం, సద్దాం, తఫిక్‌రూత్, ఫయాజ్ అలీ, మహమ్మద్ హుస్సేన్ జీపులో నుంచి ఎగిరి కిందపడ్డట్లు తెలిపారు. ఈ సంఘటనలో గాయపడ్డ కూలీలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం అనంతపు రం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.



న్యూ ఐఓసీ డిపోను తనిఖీ చేసిన సీజీఎం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని న్యూ ఐఓసీ డిపోను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఐఓసీ చీఫ్ జన రల్ మేనేజర్ ఎస్కే పట్నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఐఓసీ డిపో అభివృద్ధి అంశంలో డ్రైవర్లు, క్లీనర్ల సహ కారం ముఖ్యమన్నారు. డిపో అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో ఐఓసీ జీఎం హరినాథ్, గుంతకల్లు డిపో చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్, సీనియర్ మేనేజర్ ప్రసాద్, ఐఓసీ లైసెనర్ నజీర్, ట్యాంకర్స్ డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ అధ్యక్షుడు షెక్షావలి, కార్యదర్శి హనుమేష్, రామాంజ నేయులు, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 23: న్యాయ సేవాధికార చట్టం కింద ప్రజాప్రయోజన సేవల కేసుల్లో ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం న్యాయసేవాసదన్‌లో ప్రజాప్రయోజన కేసుల పరిష్కారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయాధికారి మాట్లాడారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వతలోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికే నల్లప్ప పాల్గొన్నారు.

సీజీపీ గురుకులంలోకి అర్ధరాత్రి ఆగంతకులు

- గది కిటికీ అద్దాలు పగులకొట్టిన వైనం
- భయాందోళన చెందిన విద్యార్థినులు
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు



ఆగంతకులు వదలి వెళ్లిన చెప్పులు, సీజీపీ గురుకుల పాఠశాలలో కిటికీ అద్దాలు పగిలిన గది

తనకల్లు, ఫిబ్రవరి 23: మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు వద్ద గిరిజన గురుకుల పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు సుమారు 480మంది బాలికలు విద్యాబోధన చేస్తున్నారు. అయితే గురువారం అర్ధరాత్రి ఆగంతకులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి ఓ గది కిటికీ అద్దాలను రాళ్లతో పగులకొట్టారు. కిటికీ అద్దాలు పగులకొట్టిన గదిలో 9వ తరగతి బాలికలు నిద్రిస్తున్నారు. ఈశబ్దానికి ఆ బాలికలు లేచి భయంతో కేకలు వేశారు. దీంతో రాత్రి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు, సెక్యూరిటీ గార్డు అప్రమత్తమయ్యారు. బాలికల గదికి వెళ్లి విషయాన్ని తెలుసుకుని చుట్టూ గాలించారు. అద్దాలు పగిలిన గది కింది భాగంలో హవాయి చెప్పులు ఉన్నాయే తప్పా.. ఆగంతుకులెవరూ కనిపించలేదు. ఒక్కసారిగా గది కిటికీ అద్దాలు పగలడంతో బాలికలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్, మానటరింగ్ సభ్యుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల కన్వీనర్ పారేసు గురుకుల పాఠశాలను సందర్శించారు. తర్వాత పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివన్నతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ దక్షిణాది రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా వెంగమేష్‌చౌదరి



ముదిగుబ్బ, ఫిబ్రవరి23: నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ కౌన్సిల్ దక్షిణాది రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన బాసినేని వెంగమేష్‌చౌదరి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్‌హెచ్ఆర్‌సీ జాతీయ చైర్మన్ సంపత్‌కుమార్ నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందాయన్నారు. తాను చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పదవిని ఇచ్చారన్నారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాహక్కుల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23: ఎస్కేయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్కేయూ పరిపాలనా భవనంవద్ద ఆందోళన చేపట్టారు. వర్సిటీ కార్యదర్శి రాజునాయక్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను పెంచి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని వాపోయారు. హాస్టల్స్‌లో తాగునీరుకూడా అందించకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో పనిచేయించుకుంటున్నారని, వారిని వెనక్కి తీసుకురావాలన్నారు. మూడేళ్లకు పైగా పనిచేసిన డిప్యూటీ వార్డెన్లను తొలగించాలన్నారు. అనంతరం వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య డిమాండ్లతోకూడిన వినతి పత్రమందజేశారు. నాయకులు వంశీకృష్ణ, తిరుమలేష్, కృష్ణ, యమన్న, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.


పరిపాలనాభవనం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

• రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 23: సాధారణ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్‌స్టేషన్‌లలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తగిన వసతులు కల్పించాలన్నారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ కేంద్రాలు పగడ్బందీగా ఉండాలని సూచించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఎన్నికల సిబ్బందని గుర్తించామని, పీఓలకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి, ఈఆర్ఓ శిరీషా,సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకు శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే 1,200 మంది టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీపీయూఎస్ఎంఏ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం కమలానగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో అపుస్మా సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ.. 25వ తేదీ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని శ్రీ 7 కన్వెన్షన్ హాల్‌లో ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. విశాఖపట్టణానికి చెందిన రామునాయుడు, వాణిశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రీ ప్రైమరీ, ప్రైమరీ టీచర్స్ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామిరెడ్డి, అడ్వైజర్ నాగవీరయ్య, కన్వీనర్ నాగరాజు, గౌరవాధ్యక్షులు నాయుడు, సంజీవరెడ్డి, సూర్యనారాయణ, తేజేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అన్వర్ పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

6.5 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23: గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు ఏడుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ ఈ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని షికారీ కాలనీకి చెందిన షికారి నాగు, షికారి మంజుల, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, బుక్కరాయసముద్రం మండలం రాఘవేంద్ర కాలనీకి చెందిన నిస్సార్ అహ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన ఎర్రతోట లక్ష్మణ్ణ, అదే గ్రామానికి చెందిన పోయింటి ఈరన్నను అరెస్టు చేశామని అన్నారు. షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎర్రతోట లక్ష్మణ్ణ, పోయింటి ఈరన్న నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. కిలో రూ.11 వేలకు కొనుగోలు చేసి, 300 ప్యాకెట్లుగా తయారు చేసుకుంటారని, ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 ప్రకారం గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి తదితర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మూర్తి, లక్ష్మీనారాయణ, శివ, రమేష్ బృందంగా ఏర్పడి ఈ ముఠాను పట్టుకున్నారని తెలిపారు. అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ధర్మవరంలో అరాచకాలకు చెక్ పెడతా

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్
- 17వ వార్డులో ఆయన సమక్షంలో భారీగా పార్టీలోకి చేరిక


పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన కాంగ్రెస్, వైసీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 23: ధర్మవరంలో వైసీపీ నాయకులు సాగిస్తున్న అరాచకాలకు త్వరలోనే చెక్ పెడతానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో 17వ వార్డుకు చెందిన కాంగ్రెస్ యూత్ లీడర్ బద్రీనాథ్, వైసీపీ నాయకులు నారాయణ స్వామి, రాముతో పాటు మరో 50 కుటుంబాల వారు పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ.. వైసీపీలో సరైన గుర్తింపులేకనే టీడీపీలోకి చేరినట్టు తెలిపారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ.. టీడీపీలోకి చేరుతున్న వారిని వైసీపీ నాయకులు కొందరు బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తెస్తూ.. టీడీపీలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. వీటన్నింటినీ లెక్క చేయకుండా చాలా మంది టీడీపీలోకి వస్తున్నారన్నారు. నాలుగున్నర ఏళ్లుగా ఇక్కడి ప్రజలు, టీడీపీ శ్రేణులు తనకు అండగా ఉన్నారన్నారు. ఇప్పుడు వైసీపీ నేతలు కూడా ఒక్కొక్కరుగా వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు బెదిరిస్తే.. భయపడే రోజులు పోయాయన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇన్నాళ్లుగా హైటెక్ పద్ధతిలో అరాచకాలు సాగించారన్నారు. సీఎం జగన్ కోడిని మింగేవారైతే.. ఎమ్మెల్యే కేతిరెడ్డి కోడితోపాటు కోడిగుడ్డు, బొచ్చును కూడా మింగేవారని విమర్శించారు. అతి త్వరలోనే అరాచకాలను ముగింపు పలుకుతానని పేర్కొన్నారు. అంతకుమునుపు 17వ వార్డులోకి వచ్చిన శ్రీరామ్‌కు స్థానికులు పూలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, పరిశేసుధాకర్, ఫణికుమార్, కాచర్లకంచన్న, చట్టా లక్ష్మీనారాయణ, నాగూర్ హుస్సేన్, ముతుకూరు బీబీ, చింతపులుసు పెద్దన్న, గరుగు వెంగప్ప తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో టీడీపీలోకి చేరిన వారు వీరే: పరిటాల శ్రీరామ్ సమక్షంలో 17వ వార్డుకు చెందిన కలి, కార్తీక్, అస్లాం, గణేశ్, ఓంరాజు, సాయి, యుగంధర్, ఓబులేశు, ఆంజనేయులు, నరసింహులు, శ్రీనివాసులు, ధనుష్, ఆచారి సూరి, ఖాసీం, ప్రసాద్, రవి, గుర్రం ఆది, మున్నా, శ్రీనివాసులు, రమేశ్, సుబ్రమణ్యం, రమణ, బాషా, ఏడుకొండలు, రమేశ్, వెంకటేశ్, ఆదినారాయణ, బన్నీ, వివేక్ తదితరులు ఉన్నారు.


గోరంట్లవారిపల్లిలో టీడీపీలోకి చేరినవారితో కందికుంట

టీడీపీలోకి చేరికలు

నల్లచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని గోరంట్లవారిపల్లికి శుక్రవారం టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వెళ్లారు. కాగా ఆయన సమక్షంలో గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్ష పాలనకు కలిసి కట్టుగా చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కష్టపడినవారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. చేరినవారు మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం పనిచేస్తామన్నారు. చేరినవారిలో యల్లప్ప, బి. రమణప్ప, ఈశ్వరప్ప, గోపాల్, పెద్ద వెంకటరమణ, చల్లా రమణప్ప, బాలాజీనాయక్, రామ్లానాయక్, అంజనప్ప, శ్రీకాంత్, నాగేంద్రతోపాటు 20కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, దాదెం శివారెడ్డి, నాగభూషణంనాయుడు, అశ్వర్థనాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, రమేష్, జక్కా లక్ష్మీనారాయణ, అంజనప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత కందికుంటను గ్రామస్థులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

కౌలేపల్లిలో 40కుటుంబాలు చేరిక

కదిరి: మండలంలోని కౌలేపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కౌలేపల్లిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్ర, సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కౌలేపల్లిలో కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులు

కార్యకర్త మృతికి పరిటాలశ్రీరామ్ నివాళి

ముదిగుబ్బ, ఫిబ్రవరి23: మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ చెంచుగారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈశ్వర్‌రెడ్డి గుండెపోటుతో గత గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి ఈశ్వర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, అశ్వర్థరెడ్డి, పతిరెడ్డి, తుమ్మల మనోహర్, సూర్యశేఖరరాజు, కోట్లబాబీ, మహబూమ్‌పీరా, వినోద్, ఆనంద్, చినగానినరసింహ, మోహన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిమర్రి, ఫిబ్రవరి 23: మండలంలోని రామాపురం సరిహద్దులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అందులో పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.40,970 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. ఆ ఏడుగురు నార్పల మండలానికి చెందిన వారని చెప్పారు. వీరిలో కుసుమ రాజు అనే వ్యక్తి గ్యాంబ్లింగ్ నిర్వహిస్తూ ఉంటాడన్నారు. జూదరులతో పాటు అతన్ని కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు రమేశ్, యాసిన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని కొట్లపల్లి, పెడపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాల్ శుక్రవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు ర్యాంపు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ మొదలైన వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, ఫిబ్రవరి 23: పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డికాలనీకి చెందిన పర్వీన్ గాజుల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అయితే కొద్దికాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అదేవిధంగా ఇదే కాలనీకి చెందిన రమాదేవి కుటుంబ కలహాలతో తన ఇంటిలో సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌ఐవీపై అవగాహన

కదిరి, ఫిబ్రవరి 23: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై శుక్రవారం ప్రభుత్వ ఎయిడ్స్ నివారణ సంస్థ, జనజాగృతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ ఎలా వస్తుందో వివరించారు. అలాగే ఆ వ్యాధి వ్యాపించకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. వ్యాధి సోకిన తరువాత తీసుకోవాల్సిన చికిత్స గురించి వివరించారు. కళాకారుల చేత నాటక రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనజాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది ప్యారీ, నీరజ, రమాదేవి, ప్రభావతి, విహాన్, చైల్డ్‌ఫండ్ ఇండియా సంస్థ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పీ. కొత్తపల్లిలో వైద్య పరీక్షలు

నల్లచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని పి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్షలో భాగంగా సచివాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు లక్ష్మీ, అనూరాధ, బాలాజీనాయక్, కల్పన గ్రామస్థులకు పలు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 373మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు గాయత్రి, తస్లీ, మాధురి, హరిత, ల్యాబ్ టెక్నీషియన్ శంకర్, ఫార్మాసిస్టు చిన్నయ్య, సచివాలయ కార్యదర్శి నరేష్, భార్గవి, ఆశకార్యకర్తలుపాల్గొన్నారు.

108వాహనంలో మహిళ ప్రసవం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని డబురువారిపల్లికి చెందిన రవి భార్య గంగాదేవికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబసభ్యులు 108 వాహనంలో ఆమెను పిలుచుకుని కదిరికి బయలుదేరారు. కాగా మార్గంమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 వాహనంలోనే ఈఎండీ హేమలత, సిబ్బంది సనావుల్లా ప్రసవం చేశారు. గంగాదేవి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

టెన్త్ విద్యార్థులు అట్టల పంపిణీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 23: త్వరలో పరీక్షలు రాయనున్న 10వ తరగతి విద్యార్థులకు సత్యసాయి భక్తుడు రవి కుమార్ తన వంతుసాయంగా శుక్రవారం అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్‌వీ జానకిరామయ్య ఉన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. హెచ్‌ఎం ప్రభావతి, సుబ్రమణ్యం, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

తనకల్లు, ఫిబ్రవరి 23: మండలంలోని కడపలవారిపల్లి గ్రామానికి చెందిన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. తనకల్లు రైల్వే బ్రిడ్జివద్ద నుంచి గ్రామంలో వరకు గుంతలమంగా ఉంది. దీంతో గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు సొంత ఖర్చులతో ఆ గుంతలను జేసీబీతో పూడ్చివేయించి రోడ్డు మరమ్మతులు చేయించారు. రహదారిని బాగు చేయించిన శ్రీకాంత్‌ను గ్రామస్థులు అభినందించారు. శనివారం గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరగనుందని, వేడుకలో పాల్గొనేందుకు సమీప గ్రామాల నుంచి ప్రజలు అధికంగా తరలివస్తారని, కనుక రోడ్డును బాగు చేయించానని యువకుడు తెలిపారు.


ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు


గొట్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


ధర్మవరంలోని 9వ వార్డులో..

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 23: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని గొట్లూరు గ్రామంలో శుక్రవారం వారు కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. అభివృద్ధి మచ్చుకు కూడా కానరావడం లేదన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. అందుకు ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. తర్వాత ప్రజలతో స్థానిక సమస్యలపై పిర్యాదులను చైతన్య రథంలోని బాక్సులో వేయించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న,మాజీ జడ్పీటీసీ రామాంజనేయులు, సర్పంచ్ ముత్యాల నాయుడు, నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, విజయసారధి, భాస్కర్‌చౌదరి, రాఘవరెడ్డి, విజయ్‌చౌదరి, నరసింహులు, సూరి, వెంకటేష్, బోయ రమణ, రాంపురం శీనా, పోతుకుంట రవి తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం: పట్టణంలోని 9వ వార్డులో గల చిన్నూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ తదితరులు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టోను ఇంటింటా తిరిగి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీరేగోపాలకృష్ణ, నాయకులు ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, షరీఫ్, సనత్‌కుమార్, మారుతీస్వామి, మాధవరెడ్డి, ఆది, రాజ, నాగేంద్ర, బాను, వసంతలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

తాడిమర్రి/బత్తలపల్లి: తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. అలాగే బత్తలపల్లి మండలం మాల్యవంతంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, జక్కంపూటి నాగభుషణ, గంటాపురం జగ్గు, తాళ్లూరిసతీష్, సాంబ, చితంబర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


తాడిమర్రి మండలం పెద్దకోట్లలో ..


బత్తలపల్లి మండలం మాల్యవంతంలో..

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, ఫిబ్రవరి 23 : పట్టణంలో సత్యసాయి గిరి పదక్షిణను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ.. భక్తిపాటలు పాడుతూ.. గిరి ప్రదక్షిణ చేపట్టారు. ప్రదక్షిణ గోకులం, ఎనుమలపల్లి సర్కిల్, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురంగేటుమీదుగా సాగి తిరిగి గణేష్ గేటుకు చేరుకుంది. తర్వాత మంగళహారతితో గిరిప్రదక్షిణను ముగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

గ్రామదేవతలకు జలాభిషేకం


సత్యమ్మకు పూజల నిర్వహిస్తున్న భక్తులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: మండలకేంద్రంలోని సీతారాముల ఆలయ నిర్మాణం సందర్భంగా గ్రామదేవతలైన నడివీధి గంగమ్మ, నాగలకట్టవద్ద ఉన్న సత్యమ్మ అమ్మవార్లకు శుక్రవారం గ్రామస్థులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 101 బిందెల నీటితో అమ్మవార్లను అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఏవైనా ఆలయాలు నిర్మించే సమయంలో గ్రామ దేవతలకు పూజలు చేయడం ఇక్కడ అనవాతీగా వస్తోందని గ్రామపెద్దలు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరయ్యశెట్టి, గందోడి నాగరాజు, నరసింహబాబు తదితరులు తెలిపారు.

తమలపాకు తోట దగ్ధం

- రూ.3 లక్షల నష్టం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని గాజుకుంటపల్లిలో ఓగేటి శ్రీనివాసులుకు చెందిన తమలపాకుల తోటలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో రూ. మూడులక్షల నష్టం జరిగిన ట్లు బాధితుడు వాపోయారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకు మూడు ఎకరాల పొలం ఉండగా.. ఎకరన్నరలో గతేడాది తమలపాకుల పంట సాగు చేశానన్నారు. తమలపాకులు కోత దశకు వచ్చాయన్నారు. శుక్రవారం కోత కోయాల్సి ఉందన్నారు. అయితే ఉదయం వెళ్లి చూడగా అగ్ని ప్రమాదంలో ఆకుతోటతో పాటు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, కేబుల్ ఇతర సామగ్రి కాలిపోయాయి కనిపించాయన్నారు. చేతికొచ్చే సమయంలో పంట బూడిదపాలైందని ఆవేదన చెందారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఆకుతోట

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

తనకల్లు, ఫిబ్రవరి 23: మండలంలోని పెద్దకడపలవారి పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అన్నదానంతోపాటు భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీల్లో మధ్యాహ్న భోజనం అందించాలి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం లేక మధ్యాహ్న భోజనం తయారు చేయలేదని, కావున మధ్యాహ్న భోజనానికి పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్పీపీ డివిజన్ కార్యదర్శి మున్నా శుక్రవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పూలరెడ్డెప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం లేక పిల్లలకు భోజనం పెట్టడంలేదన్నారు. దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు వెళ్లరాదంటూ నోటీసులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 23: ఈనెల 27వ తేదీన ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకూడదని మండలకేంద్రంలో పోలీసులు ఎస్టీయూ రాష్ట్రకార్యదర్శి రామమోహన్‌కు శుక్రవారం ముందస్తుగా నోటీసులు అందించారు. ఇందుకు రామమోహన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేదన్నారు. ఇందుకు నిరసనగా చలోవిజయవాడ తలపెట్టారన్నారు. అయితే కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వం పోలీసుల చేత నోటీసులు అందించడం ఏమిటని ప్రశ్నించారు. పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్స్, ఐఆర్ ప్రకటించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్ల సాధనకు చలో విజయవాడ వెళ్తున్నామన్నారు. నోటీసులు అందించి, వెళ్లకూడదని చెప్పడం సరికాదన్నారు. తమసమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీని గెలిపించాలంటూ యశోదమ్మ ప్రచారం


ఎంజీరోడ్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 23: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ పట్టణంలోని ఎంజీరోడ్డులో శుక్రవారం ప్రచారం చేశారు. ఆమె ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆమెకు ప్రతి ఇంటివద్ద మహిళలు హారతులు, పూలమాలలతో స్వాగతం పలికారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఆమె వెంట నాయకులు పర్వీన్‌బాను, డైమండ్ ఇర్ఫాన్, నాగప్ప, ఎస్‌బీ శీనా, తజుముల్, హనుమంతు, శ్రీనివాసులు,మనోజ్, రొద్దం బషీర్, సావిత్రమ్మ, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ప్రేమలత, ఫరీదా, అయిషా తదితరులు ఉన్నారు.

ప్రభుత్వభూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 23: ప్రభుత్వానికి సంబంధించిన భూములలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వేణుగోపాల్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కొంతకాలంగా జిల్లాకేంద్రం పరిధిలో రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వభూముల అమ్మకాలు, కొనుగోలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా కప్పలబండ పొలంలోని సర్వేనెంబరు 275లో 7.89 ఎకరాలు, సర్వేనెంబరు 308లో 13.53 ఎకరాల ప్రభుత్వ భూములలో కొందరు వ్యక్తులు క్రయవిక్రయాలు చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలు సైతం చేపట్టారని తెలిపారు. విషయం తెలియగానే తాము వెళ్లి నిర్మాణాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు నిలుపుదల చేయాలన్నారు. లేకపోతే కొన్నవారు నష్టపోతారని హెచ్చరించారు. ప్రభుత్వ భూములపై తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి భూముల క్రయవిక్రయాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే తాము వాటిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆ భూములను పంచనున్నట్లు చెప్పారు. అంతవరకు వీటిలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. అమ్మకాలు కొనుగోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

ఉపాధ్యాయుడికి రూ.1.75లక్షల ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: మండలంలోని కమ్మవారిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నేల కోటప్ప ఇటీవల అనారోగ్యానికి గురై అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన నిరుపేద కా వడంతో.. స్పందించిన మం డ ల ఉపాధ్యాయులు రూ.లక్ష 12వేలు, జిల్లాలోని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు రూ. 63,500 పోగు చేసి మొత్తం రూ.1,75,500లను శుక్రవారం అతడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సురేష్ బాబు, రమణ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం, ఎంటీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులపై దమనకాండను నిరసిస్తూ ఆందోళన

పెనుకొండ, ఫిబ్రవరి 23 : ఢిల్లీ సరిహద్దులో రైతుల పోరాటాలపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను నిరసిస్తూ బ్లాక్ డే నిర్వహించారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు చేస్తున్న పోరాటాన్ని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అణగదొక్కడం అన్యాయమన్నారు. రైతులపై టియర్‌గ్యాస్, ఫిరంగులతో దాడిచేయడంతో రబ్బర్ బుల్లెట్ తలకు తగిలి యువరైతు సుభకరణ్‌సింగ్ మృత్యువాత పడ్డారన్నారు. ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు వెంకటేశ్, ప్రవీణ్, సాంబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్మిక సంఘం పెద్దన్న, తిప్పన్న, రైతులు, మహిళలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

లిప్ అమలుపై పరిశీలన


గౌనిపల్లిలో విద్యార్థుల్లో లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సీఐపీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాఘవేంద్రప్రసాద్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23: లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్)పై శిక్షణ పొందిన ఉపాధ్యాయులు దాని ఫలితాలను తరగతి గదిలో కనిపించేలా కృషి చేయాలని సెంటర్‌ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాఘవేంద్రప్రసాద్ లిప్ రాష్ట్రప్రతినిధి అజయ్‌కుమార్ సూచించారు. లిప్ అమలును పరిశీలించడానికి శుక్రవారం మండలంలోని గౌనిపల్లి ఉన్నతపాఠశాలను, అమడగూరు మండలంలోని పలు పాఠశాలలను వారు సందర్శించారు. ప్రధానోపాధ్యాయులను , ఉపాధ్యాయులను విచారించి సులభ పద్ధతిలో బోధనా తీరును పరిశీలించారు. లిప్ ద్వారా పిల్లల్లో ధారాళంగా చదవడం, రాయడం, సామర్థ్యాలు పెంచడంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల్లో లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌ను పరిశీలించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ అజయ్, లిప్ రాష్ట్ర కమిటీ సభ్యులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పిలుపు

అగళి, ఫిబ్రవరి 23: అనంతపురంలో ఈనెల 26న జరగనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సమావేశాన్ని విజయవంతం చేయాలని సత్య సాయి జిల్లా డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అగళి మండలంలో పర్యటించిన ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి బహిరంగ సమావేశానికి అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, హాజరవుతారన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర రూరల్ ఫిబ్రవరి 23: మండలంలో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడ నున్నట్లు ఏడీ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో కల్లుమర్రి, అర్ అనంతపురం, మడకశిర విద్యుత్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలవర కు మరమ్మతులు చేపడ్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 23 : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ద్విచక్రవాహనం చోరీకి గురి అయ్యింది. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా బైక్ చోరీకి గురి కావడం ఆందోళనకు గురి చేస్తోంది. శెట్టిపల్లి గ్రామానికి చెందిన అమీర్‌సాబ్ పనినిమిత్తం ద్విచక్రవాహనంలో పెనుకొండకు వచ్చాడు. ఉదయం 9గంటల సమయంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న నాగార్జునహోటల్ ఎదుట వాహనం ఆపి టిఫెన్ చేసేందుకు హోటల్‌లోకి వెళ్లాడు. టిఫిన్ తిని బయటికి వచ్చి చూడగా తన సూపర్‌ఎక్స్‌ఎల్ వాహనం అదృశ్యమయ్యిందని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నెల రోజుల క్రితం అదే హోటల్ ముందు ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పట్టపగలే ద్విచక్రవాహనాలు చోరీ కావడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చిలమత్తూరులో..

చిలమత్తూరు: ఇంటి వద్ద నిలిపివున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్.ఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు, మండలంలోని మరవకొత్తపల్లి చెన్నకేశవరెడ్డికి చెందిన హోండా షైన్ ద్విచక్రవాహనం ఇంటి బయటి పెట్టి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి బయట ఉంచిన ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పిర్యాదు చేశారు. అక్కడ ఉన్న సీసీ పుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల మండలంలో ద్విచక్రవాహనాల చోరీ అధికం కావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో చోరీ చేసిన వాహనాలను కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం.

ఘనంగా కొల్లాపురమ్మ జాతర

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఫిబ్రవరి 23: సోమందేపల్లి మండలం మాగే చెరువులో కొల్లాపురమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జ్యోతులు మోస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత

బైక్‌ను ఢీకొన్న వాటర్ ట్యాంకర్

వ్యక్తికి తీవ్రగాయాలు

హిందూపురం అర్బన్/ ఫిబ్రవరి 23: మినరల్ వాటర్ తరలించే టాటాఏస్ వాహనం.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం గొంగటిపల్లి జాతీయ రహదారిలో దేమకేతేపల్లి వద్ద ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన మినరల్ వాటర్ సరఫరా చేసే టాటాఏస్ వాహనం లేపాక్షి నుంచి దేమకేతేపల్లికి వెళ్తోంది. గ్రామ సమీపంలో బైక్‌లో వస్తున్న చిలమత్తూరు మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన దాచేపల్లి నాగరాజును ఢీకొంది. దీంతో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. రెండు కాళ్లు విరిగాయని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వాటర్ ట్యాంకర్ కింద చిక్కుకున్న ద్విచక్రవాహనం

వైసీపీ ఐదేళ్ల పాలన అవినీతిమయం

● ప్రజాపోరుయాత్ర కన్వీనర్ రామకృష్ణ



కేంద్రం పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఫిబ్రవరి 23: వైసీపీ ఐదేళ్ల పాలన అవినీతితో గడిచిందని ప్రజాపోరుయాత్ర కన్వీనర్ రామకృష్ణ ధ్వజమెత్తారు. శుక్రవారం సోమందేపల్లి మండలం కొత్తపల్లి, రంగేపల్లి, మాగేచెరువు పంచాయతీల్లో ప్రజాపోరుయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి పరిపాలనను ఎత్తి చూపుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న పథకాలను వివరించడమే ప్రజాపోరుయాత్ర ధ్యేయమన్నారు. బీజేపీ మండలాధ్యక్షులు కళిగేరి సోమశేఖర్, నాగప్ప, మంజునాథ్, బాలాజీ, అంజినప్ప, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, ఫిబ్రవరి 23 : మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అలంకరణలో అమ్మవారు

కల్యాణ వైభోగమే..



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



ముస్తాబైన శ్రీవారు



ఊరేగింపులో జ్యోతులు మోస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 23: పట్టణ పరిధిలోని పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవిలతో కలిసి కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో, మేళాతాలాలు, మంగళ వాయిద్యాలతో వేడుకలు అబ్బురమనిపించాయి. వందలాది మంది భక్తులు హాజరై వేడుకలను తిలకించారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ వెంకటేశ్వరస్వామి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గోవింద నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోసి భక్తిని చాటుకున్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి పరుగులు

● రాష్ట్రం గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే బాబు సీఎం కావాలి ● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



సూపర్‌సిక్స్ క్యాలెండర్లను విడుదల చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిరటౌన్, ఫిబ్రవరి 22: చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'బాబు సూపర్ సిక్స్' క్యాలెండర్‌లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్రం గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయనను సీఎం చేయడమే ఏకైక లక్ష్యమని, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. రాష్ట్ర అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే ఏకైక నాయకుడు చంద్రబాబు అని ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బాబు ష్యూరిటీ భవిషత్తు గ్యారెంటీలో భాగంగా సూపర్‌సిక్స్ క్యాలెండర్లను విడుదల చేశామన్నా రు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు నెలకొల్పడం, మహిళల సంక్షేమం , రైతు అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబుతోనే సాధ్య మన్నారు. సూపర్‌సిక్స్ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

26న టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

ఈనెల 26న టీడీపీ విస్తృత స్థాయి సమావేశం, మడకశిర పట్టణంలోని యాదవ కల్యాణ మండపం నందు పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ప్రధాన కా ర్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేపట్టే కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. ప్రజల్లోకి వైసీపీ అవినీతి అక్రమాలను బలంగా తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చిస్తామ న్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాల న్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, మైనారిటీ అధ్యక్షులు భక్తర్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షులు మనోహర్, తదితరులు ఉన్నారు.

టీడీపీ అనుబంధ కమిటీ ఎంపిక

మడకశిర పట్టణ టీడీపీ అనుబంధ కమిటీని ఎంపిక చేసినట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా సోము, ప్రధాన కార్యదర్శిగా చిన్నప్ప, తెలుగు యువత కమిటీ అధ్యక్షుడిగా ఎస్.ఆర్.తిమ్మరాజు, ప్రధాన కార్యదర్శిగా ఓంప్రకాష్, టీఎన్ఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా సి.ఆర్.ప్రణీత్ ప్రధాన కార్యదర్శిగా టి.శేషాద్రి, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా రఘు, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా టి.రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శిగా సేవానాయక్, మహిళా కమిటీ అధ్యక్షులుగా అంజమ్మ, ప్రధాన కార్యదర్శిగా గౌరమ్మ, మైనారిటీ కమిటీ అధ్యక్షులుగా ఫయాజ్, ప్రధాన కార్యదర్శిగా అంజాద్‌బాషాలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్ ఫిబ్రవరి 23 : ఎఫ్ పీ షాపుల్లో కార్డుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటేశ్ హెచ్చరించారు. ఈ నెల 20 న ఆంధ్రజ్యోతిలో అడిగేవారెవరని..! శీర్షికతో ప్రచురించిన కథనంపై స్పందించిన అధికారులు శుక్రవారం డీలర్ల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో సక్రమంగా లబ్దిదారులకు అందజేయాలన్నారు. అనంతరరం ఈ నెలల్లో ఇప్పటి వరకు రేషన్ కార్డులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయని డీలర్లకు, ఎండీయూ వాహదారులకు మెమో లు జారీ చేశారు. డీప్యూటీ తహసీల్దార్ బా లాంజనేయులు, సీఎస్‌డీటీ హారతి, డీలర్లు, ఎండీయూ వాహదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

ఇసుకాసురుడు సీఎం జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



పెనుకొండ, ఫిబ్రవరి 23 : రాష్ట్రంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడ్తూ , రూ.కోట్లాది రూపాయలు అక్రమంగా గడిస్తూ సీఎం జగన్ ఇసుకాసురుడిగా మారాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి విమర్శించారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో విడుదలచేస్తూ రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు నిజమేనని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు తెలిపిందన్నారు. ఎన్‌డీటీ ఆదేశాల కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల్లో పరిశీలించారని భారీ ఎత్తున ఇసుకను అక్రమంగా తవ్వించారని అధికారులే తేల్చి చెప్పారన్నారు. అక్రమ ఇసుక తవ్వకాల ఫొటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు, తదితర ఆధారాలను కమిటీ సేకరించిందని దీనిపై సీఎం జగన్ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతల ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 45మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇసుక మాఫియాను ప్రశ్నించిన వారిపై దాడులు, కేసులతో బెదిరించడం, వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండలం పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందన్నారు. ఇప్పటి వరకు టీడీపీ రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టినా ప్రభు త్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు.

చంద్రబాబుని సీఎం చేయడమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న



గౌడనహళ్ళి గ్రామంలో ప్రచారంలో టీడీపీ నాయకులు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 23: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుని మళ్లీ ముఖ్యమంత్రిని చేయ డమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న సూచించారు. శుక్రవారం మండలంలోని గౌడనహళ్ళి, అర్. అనంతపురం పంచాయతీలో సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేసి వాటి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సునీల్ కుమార్ ,మాజీ ఎంపీపీ అశ్వత్థమప్ప, మాజీ మండలకన్వీనర్ రామాంజనేయులు, పాండురంగప్ప, ఉగ్రనరసింహప్ప, హనుమంతరాయప్ప, రాజగోపాల్, క్రిష్టప్ప, ఈశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు: ప్రిన్సిపాల్

రొద్దం, ఫిబ్రవరి 23 : ప్రతి విద్యార్థి భవిష్యత్తు విద్యతోనే ముడిపడి ఉందని బాధ్యతాయుతంగా కష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. శుక్రవారం రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో కస్తూర్బా పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సరస్వతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షా సమయం దగ్గరపడుతోందని ఒత్తిడికి గురికాకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదువుకోవాలని సూచించారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత భావాలతో ఉన్నత చదువులు చదివి అటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నాగలక్ష్మీదేవి, నాగమణి, శాంతమ్మ, అరుణ, సుశీలమ్మ, శోభ, వెంకటేశ్వరి, రిహానా, షబానా పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఆందోళలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు

రైతులపై దమనకాండను నిరసిస్తూ ఆందోళన

పెనుకొండ, ఫిబ్రవరి 23 : ఢిల్లీ సరిహద్దులో రైతుల పోరాటాలపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను నిరసిస్తూ బ్లాక్ డే నిర్వహించారు. శుక్రవారం వ్యవసా య కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు చేస్తున్న పోరాటాన్ని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అణగదొక్కడం అన్యాయమన్నారు. రైతులపై టియర్‌గ్యాస్, ఫిరంగులతో దాడిచేయడంతో రబ్బర్ బుల్లెట్ తలకు తగిలి యువరైతు సుభకరణ్‌సింగ్ మృత్యువాత పడ్డారన్నారు. ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు వెంకటేశ్, ప్రవీణ్, సాంబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్మిక సంఘం పెద్దన్న, తిప్పన్న, రైతులు, మహిళలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొండి బస్సులతో వేగలేకపోతున్నాం..

అగళి, ఫిబ్రవరి 23 : తరచూ ఆగిపోతున్న ఆర్టీసీ బస్సులతో వేగలేకపోతున్నామని అగళి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర నుంచి అగళికి వచ్చి పోయే బస్సులు ఎక్కడ బడితే అక్కడ నిలిచిపోయి ప్రయాణికులకు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అగళిలో ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో అటు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇటు విద్యార్థులు ప్రజలు బస్సును ముందుకు తోసినా స్టార్ట్ కాకపోవడంతో ప్రత్యామ్నాయ వాహనాలపై ఆధార పడాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను మరమ్మతు చేయించాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఆగిపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

చెక్‌పోస్టు పడతాది..!

●ఎన్నికల వేళ కొడికొండ చెక్‌పోస్టులో ముమ్మర తనిఖీలు.. అప్రమత్తత ముఖ్యం



కొడికొండ చెక్‌పోస్టులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 23: ఏ మాత్రం నిర్లక్ష్యంగా ప్రయాణించినా చెక్‌పోస్టు పడతాది. వాహనంలో లెక్కలు లేని విలువైన వస్తువులు ఉన్నా... సరదాగా స్నేహితులతో కలిసి సేవించేందుకు కర్ణాటక మద్యం దగ్గర ఉన్నా.. ఒకవేళ అక్కడే మిత్రులతో కలిసి పార్టీ చేసుకుని, మద్యం సేవించి వస్తున్నా... అంతే సంగతులు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటక నుంచి జిల్లాలోకి వచ్చే వాహనాలకు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో 44వ జాతీయ రహదారిపై క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సెబ్, సివిల్ పోలీసులతో తనిఖీలు ముమ్మరం చేశారు.

కర్ణాటక నుంచి వస్తుంటే ఏమరపాటు వద్దు

కొడికొండ చెక్‌పోస్టులో నిరంతరంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. కర్ణాటక నుంచి వాహనాల్లో ఆంధ్రలోకి వచ్చే సమయంలో తమ వెంట ఏమేమి వస్తువులు ఉన్నాయి? వాటిపై ఆంధ్రలో నిషేధమేమైనా ఉందా? వెంట తీసుకెళ్తున్న వస్తువులకు లెక్కలు, బిల్లులు ఉన్నాయా? నగదు అయితే ఎంత తీసుకెళ్లవచ్చు? దానికి సంబంధించి సరైన బిల్లులు ఉన్నాయా? అనే విషయాలను కచ్చితంగా సరిచూసుకోవాలి. సరదాకని స్నేహితులతో కలిసి వస్తున్నపుడు బెంగళూరు ఇతర నగరాలకు వెళ్లి ఆంధ్రలోకి వస్తున్న సమయంలో వెంట తీసుకువస్తున్న మద్యం బాటిళ్లు, ఇతర మత్తు పదార్థాల విషయంలో జాగ్రత్త అవసరం. అలాంటివి తనిఖీల్లో పట్టుపడితే కచ్చితంగా కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేస్తున్నారు. తనిఖీలే కదా అని నిర్లక్ష్యంగా వస్తే మాత్రం తప్పకుండా కష్టాల్లో పడినట్లే. ఎన్నికల వేళ కర్ణాటక నుంచి వచ్చే సమయంలో ఏది దొరికితే ఆ వాహనంలో లిఫ్ట్ అడిగి ప్రయాణించినా కష్టాలను కొనితెచ్చుకున్నట్లే. ఆ వాహనంలో ఏ ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా చేస్తున్నా అందులో ఇరుకున్నట్లే. కావున జాగ్రత్త పాటించడం మంచిది.

నిర్లక్ష్యంగా వచ్చి ఇలా బుక్కయ్యారు..

ఈఏడాది జనవరి 6వ తేదీన బాగేపల్లి నుంచి అనంతపురం వైపు స్కూటీలో వస్తున్న ఒక వ్యక్తి కొడికొండ చెక్‌పోస్టులో వాహన తనిఖీల్లో పట్టుపడ్డాడు. అతని స్కూటీ డిక్కీలో రూ.10 లక్షల నగదు పట్టుబడింది. నగదుకి లెక్కలు చెప్పాలని సెబ్ అధికారులతో పాటు ఆదాయపు పన్ను అధికారులు ప్రశ్నించడంతో జవాబు చెప్పలేకపోయాడు. దాంతో ఆ నగదును సీజ్ చేసి, ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు.



పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

● ఈ ఏడాది జనవరి 25న చిలమత్తూరులో పనిచేసే ఓ పంచాయతీ కార్యదర్శి స్నేహితులతో కలిసి బాగేపల్లి నుంచి వాహనంలో కర్ణాటక మద్యం తీసుకొస్తూ పట్టుపడ్డాడు. సరదాగా స్నేహితులతో కలిసి తాగేందుకు 10 లోపు బాటిళ్లు తీసుకువస్తున్నా ఎవరైతే ఏంటి అంటూ ప్రభుత్వ అధికారైనా అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కి పంపారు.

● ఫిబ్రవరి 12న బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఆపి, తనిఖీ చేశారు. అందులో రూ.48 లక్షల విలువచేసే 57 కిలోల వెండి ఆభరణాలు పట్టుపడ్డాయి. వాటికి లెక్కలైతే సంబంధిత అధికారులకు చెప్పుకున్నా ఆ ఆభరణాలను రవాణా చేయడానికి వేబిల్లు వారి వద్ద లేకపోయింది. దాంతో వారికి జీఎస్టీ అధికారులు రూ.2.7లక్షల జరిమానా విధించారు. ఆ మేరకు చెల్లించి ఆభరణాలు తీసుకెళ్లారు.

● ఫిబ్రవరి 16న బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారుని సెబ్ అధికారులు తనిఖీ చేశారు. అందులో ముగ్గురు వ్యక్తులు సరదాగా ఊర్లో తాగేందుకని కర్ణాటక మద్యం తీసుకువస్తూ పట్టుపడ్డారు. కారుని సీజ్ చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు సాక్షాత్తు పోలీసు కానిస్టేబుల్. ఈ కానిస్టేబుల్ బెంగళూరు నుంచి అనంతపురం రావడానికి బస్సు కోసం మధ్యలో వేచిచూస్తుండగా ఆ కా రులో లిఫ్ట్ తీసుకున్నాడని, కర్ణాటక మద్యంతో అతడికి సంబంధం లే దని పోలీసులు విచారణలో తేల్చి చెప్పారు. మి గిలిన ఇద్దరు కూడా వేరే డిపార్టుమెంట్‌కి చెందిన ప్రభుత్వ ఉద్యోగులే కావడం కొసమెరుపు.